

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ అభిలాష అభినవ్

ప్రజా సమస్యలపై సమన్వయంతో పనిచేయండి

● జెడ్సీ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మూసాపేటలో జోనల్ కార్యాలయంలో శనివారం జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ విభాగాల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో గుర్తించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో తలెత్తే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గతంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో గుర్తించిన సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఉపకమిషనర్లు కృష్ణయ్య, మల్లారెడ్డి, రమేష్, నర్సింహ, జలమండలి జీఎం ప్రభాకర్‌రావు, ఈఈలు గోవర్ధన్‌గౌడ్, సత్యనారాయణ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోండి'

గచ్చిబౌలి, మే 18 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం జోనల్ కార్యాలయంలో వెస్ట్‌జోన్ పరిధిలో గల సర్కిళ్ల అధికారులు, మెట్రో వాటర్, విద్యుత్ ఆర్ అండ్ బీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్ల మధ్యలోగల విద్యుత్ స్తంభాలను తొలగించాలని, నాలాల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జీహెచ్ఎంసీలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

21న కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో క్విజ్ పోటీలు

కూకట్‌పల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో ఈనెల 21వ తేదీన క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని జెడ్సీ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 16 సంవత్సరాలలోపు వయస్సు వారు పాల్గొనవచ్చని, పేర్ల నమోదుకు కోచ్ అంజిబాబు (ఫోన్ నంబర్ 9652777713)ను సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9908770800 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా అలీఫ్ ఫీడర్ పారిశ్రామికవాడ పరిధిలో ఆదివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వివేకానందనగర్‌కాలనీ, మే 18 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ గంగారంకు చెందిన కె.రమేష్‌బాబుకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని తన నివాసంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.



ఆల్విన్ కాలనీ నల్లపోచమ్మ ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ఓల్డుబోయినపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

ఓల్డుబోయినపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): భవానీనగర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం ఆరాధనోత్సవాలు నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రామలింగాచారి, సాయికుమార్, కాళిదాస్ తదితరులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

చందానగర్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా చందానగర్‌లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

మియాపూర్: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో గల నల్లపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో శనివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణగౌడ్, సందీప్ ముదిరాజ్, అనీల్‌రెడ్డి, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

అక్క మందలించిందని చెల్లి అదృశ్యం

గాజులరామారం, మే 18 (ఆంధ్రజ్యోతి): అక్క మందలించిందని చెల్లి కనిపించకుండాపోయింది. సూరారం సుదర్శన్‌నగర్‌లో నివసిస్తున్న రాంబాబు ఇంట్లో అతడి సోదరుడు రవిబాబు కుమార్తె ప్రతిభా భారతి(16) రెండు నెలల నుంచి ఉంటూ చదువుకుంటోంది. శుక్రవారం ల్యాప్‌టాప్ చూస్తోంది. రాంబాబు పెద్ద కుమార్తె హవిలా భారతి పదో తరగతి సప్లిమెంట్ పరీక్షలు దగ్గరపడ్డాయి, చదువుకోమని ప్రతిభా భారతిని మందలించింది. మనస్తాపం చెందిన బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ప్రతిభా భారతి ఆచూకీ లభించకపోవడంతో రాంబాబు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షం

● శేరిలింగంపల్లిలో రెండుగంటలపాటు..

● లోతట్టు ప్రాంతాలు జలమయం



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు

రాయదుర్గం, మే 18 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిలో శనివారం మధ్యాహ్నం రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలతోపాటు రోడ్లపై నీరు నిల్వడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. గచ్చిబౌలి, బయోడైవర్సిటీ సర్కిల్, ఐకియా, రహేజా మైండ్ స్పేస్, మాదాపూర్, కొండాపూర్, కొత్తగూడ, ట్రిపుల్ ఐటీ సర్కిల్, నానక్‌రామ్‌గూడ విప్రో సర్కిల్, నానక్‌రామ్‌గూడ ఔటర్ రింగురోడ్డు సర్కిల్, ఖాజాగూడ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సర్కిల్, బొటానికల్ గార్డెన్ సర్కిల్, మియాపూర్, లింగంపల్లి, అయ్యప్ప సొసైటీ, హఫీజ్‌పేట్, చందానగర్, లింగంపల్లి అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.



లింగంపల్లిలో రోడ్డుపై నిలిచిన నీరు



మాదాపూర్‌లో ట్రాఫిక్ జామ్

కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఫతేనగర్ ఆలయంలో పూజలో కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదతరులు



చందానగర్ హుడా కాలనీలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలో భక్తులు

చందానగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి జయంతిని హుడా కాలనీలోని ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేక, కుంకుమార్చన, పుష్పాలంకరణలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వాసు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● శేరిలింగంపల్లి రాజీవ్ గృహకల్పలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఫతేనగర్: కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా ఫతేనగర్‌లో ఆలయంలో నిర్వహించిన పూజల్లో కార్పొరేటర్ సతీష్‌గౌడ్ పాల్గొన్నారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ రామయోగిగుప్తా, వెంకటేశం గుప్తా, నాగేష్ గుప్తా, వాసు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భెల్‌కాలనీ, మే 18 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర, యోగేశ్వరస్వామి దేవస్థానంలో వారం రోజులుగా అంగరంగ వైభవంగా జరిగిన 56వ వార్షిక బ్రహ్మోత్సవాలు, విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ముగిశాయి. దేవాలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో స్వామి వారికి చక్రస్నానం చేయించారు. దేవాలయ అర్చకుడు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి సర్వదేవతలకు విశేష కమలాలతో హోమం, సహ్రసనామ హోమం, శ్రీనివాస మూల మంత్రహోమం, తామరపువ్వులతో సహస్రనామార్చన, శ్రీలక్ష్మీసుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు జరిగాయి.





తులసీదళాల అలంకరణలో స్వామివారి మూల విగ్రహం, మహా సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భెల్ కమ్యూనిటీ సెంటర్‌లో యోగాసనాలు

భెల్‌కాలనీ, మే 18 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ కాలనీలో గల పార్కులు, మైదానాల అభివృద్ధికి యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని భెల్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ వి. శ్రీనివాస్‌రావు తెలిపారు. కాలనీలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, కమ్యూనిటీ సెంటర్‌లో ప్రతియేటా నిర్వహిస్తున్న వేసవిశిక్షణ శిబిరంలో భాగంగా శనివారం యోగా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, యోగా చేస్తే మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 600 మంది చిన్నారులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సెంటర్ అధ్యక్షుడు, జీఎం చంద్రశేఖర్, సీసీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ మాయబ్రహ్మ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

గ్రేటర్ రోడ్లపై ఆర్టీసీ డ్రైవర్లు రయ్ రయ్..

● ర్యాష్ డ్రైవింగ్‌తో వాహనదారులను హడలెత్తిస్తున్నవైనం

● ఉదయం, రాత్రి వేళల్లో వేగంగా దూసుకెళ్తున్న బస్సులు

● సిబ్బంది పనితీరుపై ఆకస్మిక తనిఖీలకు ఉన్నతాధికారుల చర్యలు


హైదరాబాద్‌సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ రోడ్లపై కొందరు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ర్యాష్‌డ్రైవింగ్‌తో దూసుకుపోతూ వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై ర్యాష్ డ్రైవింగ్‌తో బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రయాణికులు బస్సులు దిగకముందే ముందుకు కదలడంతో బస్సుల నుంచి దిగలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, స్టాపుల వద్ద అతివేగంగా బస్సులను నడుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,800 బస్సులతో రోజూ 30 వేల ట్రిప్పులు నడుపుతోంది. ప్రధాన రహదారులపై ఉదయం ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో కొందరు డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆపకుండా వెళ్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రద్దీ సమయాల్లో బస్టాపుల్లో బస్సులను ఆపకుండా రోడ్ల మధ్యలో నిలపడం వల్ల వెనుకవచ్చే వాహనదారులు బస్సులకు తాకి ప్రమాదాలకు గురవుతున్నారు.

గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, జూబ్లీహిల్స్, ఉప్పల్, ఈసీఐఎల్, కొండాపూర్, జీడిమెట్లతోపాటు శివారు ప్రాంతాల్లో ఉదయం వేళల్లో కొందరు డ్రైవర్లు అతివేగంగా బస్సులు నడుపుతున్నారంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులను ఆర్టీసీ సీరియస్‌గా పరిగణిస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈడీ స్థాయి అధికారులతోపాటు డిపో మేనేజర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. బస్టాపులో బస్సులు నిలపకపోయినా, వేగంగా బస్సులు నడిపినా బస్సు నంబర్, సమయపాలన వివరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

స్వేచ్ఛ ఆధ్వర్యంలో ఏఐపై ఇంటర్న్‌షిప్

రాయదుర్గం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా లక్షమందికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నట్లు స్వేచ్ఛ సంస్థ వ్యవస్థాపకు వై. కిరణ్‌చంద్ర తెలిపారు. గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఓజోన్టెల్ కమ్యూనికేషన్స్, మెటా సహకారంతో లక్ష మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐపై ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. స్వేచ్ఛ అనేది ఉచిత సాఫ్ట్‌వేర్, నాలెడ్జ్‌ను అందించే లాభాపేక్ష లేని సంస్థ అన్నారు. ఈ వేసవిలో సమ్మర్ ఆఫ్ ఏఐపై ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌ను రూపొందించామన్నారు. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనే విద్యార్థులకు ఏఐలో నిష్ణాతులైన వారు తర్ఫీదునిస్తారని తెలిపారు. నెల రోజుల పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు స్వేచ్ఛ వెబ్ లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఓజోన్టెల్ కమ్యూనికేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సీటీఓ చైతన్య చొక్కారెడ్డి, స్వేచ్ఛ సెక్రటరీ ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఏఐ కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న కిరణ్‌చంద్ర

25 నుంచి శంకరమఠం రజతోత్సవాలు

అల్లాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌లోని శృంగేరి శారదా శంకర మఠంలో ఈ నెల 25 నుంచి రజతోత్సవాలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీ గణపతి హోమం, గోపూజ, శ్రీ లలితా హోమము, శారదా అమ్మవారి నగర ఉత్సవం(పల్లకీ సేవ) ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లో ఉమారామలింగేశ్వర స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ దాత, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శైలజ దంపతులు పూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

– కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

25 ఏళ్ల నుంచి వినియోగదారులకు సేవలు



విజేత సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

నిజాంపేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి గ్రామంలో విజేత సూపర్ మార్కెట్ 111వ శాఖను టెక్నోపోలీస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. తిరుపతిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. 25 సంవత్సరాల నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. కస్టమర్లే మా దేవుళ్లని అన్నారు. నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విజేత సూపర్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో ముగిసిన సమ్మర్ ఆర్ట్ క్యాంపు



విద్యార్థినుల నాట్య ప్రదర్శన

మాదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంపు ముగింపు ఉత్సవం ఎత్నిక్ హాల్‌లో శనివారం జరిగింది. పదిహేను రోజుల నుంచి శిల్పారామం ఆర్టిసన్స్ మధుబని పెయింటింగ్, మట్టితో కుండలు చేయడం, పెన్సిల్ స్కెచ్, మండల పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్ గవ్వలతో బొమ్మలు చేయడం, ట్రైబల్ పెయింటింగ్‌లో పిల్లలు, పెద్దలకు శిక్షణ ఇచ్చారు. 92 మందికి శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు ప్రశంసాపత్రాలను ఇచ్చి ప్రోత్సహించారు.

సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కలర్స్ ఆఫ్ డ్యాన్స్ ఎస్ఎస్ఎల్ ప్రవీణ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అంబ పరాకు, పూర్వరంగం, వినాయక కౌతం, తాండవ నృత్య కరి, నమశివాయతే, ఆనంద నర్తన గణపతిమ్, చేరి యశోదకు, అచ్యుతం కేశవం, హిందువుల తిల్లాన, బృందావన నిలయేహ్, రామచంద్ర కృపాలు, మంగళం అంశాలను అక్షిత, అలివేణి, శివాలక్ష్మి, శాన్వి, అనన్య, కళ్యాణి, లావణ్య, ఆశ్రిత, శ్రీపాద, సహస్ర, మోక్షిత, జాహ్నవి ప్రదర్శించి మెప్పించారు.